ప్రజాశక్తి
శనివారం 17 డిసెంబర్ 2022
5
అనంతపురం

19 నుంచి బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలు

- అందరూ పాల్గొని జయప్రదం చేయండి
- ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 19, 20, 21, 22వ తేదీల్లో అనంతపురం నగరంలోని లలితకళాపరిషత్‌లో బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలు జరగనున్నాయని, ఇందులో ప్రముఖులు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జయప్రం చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల కోరారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో చోటు చేసుకున్న అసాంఘిక చర్యలు, మహిళలపై దాడులు, హింస తదితర వాటి నిర్మూలన కోసం నాడు సమసమాజం కోసం పాటుపడిన మహనీయుల జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజేసేలా బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే, లలితకళాపరిషత్ సౌజన్యంతో ఐద్వా, సిఐటియు, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయని చెప్పారు. 19న మహాత్మా జ్యోతిరావు పూలే సత్యసోదన, 20న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సంఘం శరణం గచ్ఛామి, 21న సంస్కరణోద్యమ ఖడ్గదారి కందుకూరి, 22న వేమన వినురవేమ నృత్య రూప నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో జరుగుతున్న వివక్షత అంటరాని తనం, లింగ వివక్ష నుంచి బయట పడాలంటే ఆ మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, కార్మిక వర్గంపై జరుగుతున్న దాడులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కదారి పట్టించేలా పాలకులు వింత వైఖరి అనుసరిస్తున్నారని తెలిపారు. మనువాద భావాలను ప్రజలపై రుద్దేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. సామాజిక వర్గాల హక్కుల సాధన చైతన్య పోరాటాలతోనే సాధ్యమన్నారు. పోరాట స్ఫూర్తిని పెంపొందించేందుకు బహుజన సాసంస్కృతిక చైతన్య ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు కలెక్టర్, ఎస్పీ, ప్రజా ప్రతినిధులు, మేధావులు, కవులు, ఉపాధ్యాయులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు, మహిళలు, విద్యావేత్తలు, మేధావులు, ప్రజలందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కళాశాలలు, హాస్టల్స్ విద్యార్థులు ఉత్సవాలకు వచ్చేలా అధ్యాపకులు, వార్డెన్‌లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

లోపమెక్కడ..?

దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉంది. నిత్యం కరువులకు నిలయమైన ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు అధికంగా ఉన్నాయి. ఇటువంటి ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి జరగాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నా, ఆచరణలో మాత్రం ఇది కన్పించడం లేదు. ఉమ్మడి జిల్లాల పరిధిలో వెయ్యి మందికిపై ఉపాధి కల్పించే పరిశ్రమ ఒక్కటీ లేదన్నది నిష్టూర సత్యం. స్థానికంగా ఏర్పాటు చేయాలనుకున్న పరిశ్రమలు సైతం పక్క జిల్లాలకు తరలిపోతుండడం గమనార్హం. ఇవి ఎందుకు పక్క జిల్లాలకు తరలి వెళు తున్నాయి.? లోపం ఎక్కడుందన్న విషయాన్ని తెలపాల్సిన పాలకులు, అధికారులు దీనిపై నోరు మెదపకున్నారు.

- చేజారుతున్న పరిశ్రమలు
- వచ్చినట్టే వచ్చి పక్కకు వెళ్తున్న వైనం
- ప్రజాప్రతినిధులు, అధికారుల మౌనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిధిలో దశాబ్దాల తరువాత 2014లో పెనుకొండ వద్ద ఏర్పాటైన కియా కార్ల తయారీ పరిశ్రమే అతి పెద్దది. అది వచ్చాక అనేక అనుబంధ సంస్థలూ వచ్చాయి. సుమారు 20 వేల మందికి ఉపాధి ఈ పరిశ్రమ ద్వారా కలుగుతోంది. ఇది చూసి మరిన్ని పరిశ్రమలు ఇటువైపు వస్తాయన్న నమ్మకమూ అందరిలో కలిగింది. అందుకు తగ్గట్టుగానే కొన్ని భారీ పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. సత్యసాయి జిల్లా సరిహద్దులోని కొడికొండ నుంచి ఇటు అనంతపురం వరకు జాతీయ రహదారి వెంట పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుందన్న నమ్మకమూ జిల్లా వాసుల్లో కలిగింది. 2019 నుంచి చూస్తే పారిశ్రామికాభివృద్ధి దాఖలాలు ఒక్కటీ కనిపించకుండా పోయాయి. అంతకు ముందే వస్తాయని భావించిన పరిశ్రమలూ ఇక్కడ ఏర్పాటవకుండానే పక్క జిల్లాకు తరలి వెళ్లడం అందరినీ నిరాశకు గురిచేస్తోంది.

వచ్చినట్టే వచ్చి పక్కకెళ్లిన పరిశ్రమలు

2019కి ముందే కొన్ని పరిశ్రమలు జిల్లాకు రావడానికి సుముఖత వ్యక్తం చేశాయి. అందులో కనగానపల్లి మండలం దాదులూరు వద్ద జెఎస్‌డబ్ల్యూ స్టీల్ పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం ఆ ప్రాంతాన్ని పరిశీలించింది. ఇందుకోసం 600 ఎకరాల భూమిని కూడా ఎపిఐఐసి పరిశ్రమ చూసి పెట్టింది. ప్రాథమిక దశలో ఆ పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు సాగింది. అయితే మధ్యలో ఏమైందో తెలియదుగానీ, ఇప్పుడు ఆ పరిశ్రమ కడప జిల్లాకు తరలి వెళ్లింది. ఇది ఏర్పాటయితే అటు కియా, ఇటు జెఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ రావడంతో పెద్దఎత్తున పారిశ్రామికాభివృద్ధి సాగుతుందని ప్రజలు భావించారు. చివరి నిమిషంలో అది మారిపోయింది. ఇక జాకీ పరిశ్రమ ఏర్పాటుకు పనులు ప్రారంభించి చివరి నిమిషంలో అది కూడా పక్కకు వెళ్లింది. ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేయలేమంటూ జాకీ యాజమాన్యం ఎపిఐఐసికి ఒక ఉత్తరాన్ని అందజేసి వెళ్లిపోయింది. పరిశ్రమ ఏర్పాటు చేయకుండా వారి వెళ్లిపోతున్నా, ఇక్కడే ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రయత్నాలూ జరగలేదనే చెప్పాలి. ఆ తరువాత వచ్చిన మరో రెండు భారీ టెక్స్‌టైల్స్ పరిశ్రమలు కూడా స్థల పరిశీలన జరిపి ఎంఒయు సమయంలో కడప జిల్లాకు వెళ్లాయి. జిల్లాలో ఏర్పాటు కావాల్సిన టెక్స్‌టైల్స్ పరిశ్రమలూ రాకుండా పోయాయి. చిలమత్తూరు మండలంలోనే గతంలో ఏర్పాటు చేస్తామన్న ఎయిర్‌బస్, వీరవాహన్‌తో పాటు పలు పరిశ్రమల పేర్లు వినిపించినప్పటికీ ఏర్పాటు జరిగే వరకు సందేహాలు మాత్రం వీడటం లేదు. ఈ రకంగా జిల్లాకు వస్తాయనుకున్న పెద్ద పరిశ్రమలు రాకుండానే పక్కకు తప్పుకున్నాయి.

వికేంద్రీకరణ మాటల్లోనేనా.?

గత కొద్ది రోజులు అభివృద్ధి వికేంద్రీకరణపై పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. అభివృద్ధి వికేందీక్రరణ ద్వారా జరిగే అభివృద్ధిపై మాత్రం చర్చ జరగడం లేదని జిల్లావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పరిశ్రమలుగాని, సాగునీటి ప్రాజెక్టులుగా వచ్చిందేమి లేదన్న విమర్శిస్తున్నారు. కనీసం వికేంద్రీకరణ ద్వారా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక కూడా ప్రభుత్వం వైపు నుంచి ప్రకటించలేదని ప్రశ్నిస్తున్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎజి.రాజమోహన్

18న జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి శతజయంతి స్మారకోపన్యాసం

హాజరు కానున్న జస్టిస్ కె.చంద్రు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా వాసి, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి శత జయంతి వేడుకలను ఈ నెల 18వ తేదీన ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో నిర్వహిస్తున్నట్లు విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి అన్నారు. జడ్జిగా ఆయన చేసిన తీర్పులు, న్యాయవాదిగా ప్రజల సమస్యలపై వాదించిన కేసులు దేశవ్యాప్తంగా ఆదర్శవంతంగా నిలిచాయని తెలిపారు. అలాంటి జడ్జి జిల్లాకు చెందిన వ్యక్తి కావడం గర్వంగా ఉందన్నారు. అలాంటి గొప్ప న్యాయమూర్తి జ్ఞాపకాలను స్మరించుకోవడానికి ఓ.చిన్నపరెడ్డి శతజయంతిని విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ విలువలు- జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పులు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ చంద్రు ముఖ్య వక్తగా హాజరవుతున్నట్లు తెలిపారు. న్యాయవాదులు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్‌లు శ్రీనివాసరావు, ఎంఎన్‌టి.రాజు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న బిసి.సురేష్ యాదవ్ తదితరులు

వసతి గృహం మూసివేతను ఆపాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆమిదాల బిసి బాలుర వసతి గృహం మూసివేత నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి.సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోషల్ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా పేద బీసీలు ఉన్న జిల్లా అన్నారు. పేద విద్యార్థులు బీసీ వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారని హాస్టల్‌ను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు రాజు, దిలీప్ కుమార్, నాగరాజు, రామచంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓబవ్వ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

చిత్రదుర్గ కోటకు రక్షణ కవచంగా ఉన్న వణికే ఓబవ్వ జయంతి వేడుకలను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు జిఒ విడుదల చేయడం ఆనందదాయకంగా ఉందని మాల మహానాడు అధ్యక్షులు ఓబులేసు అన్నారు. శుక్రవారం అందుకు హర్షం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18న కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించే వణికే ఓబవ్వ జయంతికి జిల్లా నుంచి రావాలని ఆహ్వానం వచ్చిందన్నారు. ఆ మేరకు జిల్లా నుంచి తరలి వెళు తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుగమంచి శీనా, ఉపాధ్యాయులు వీరన్న, కోశాధికారి మల్లేష్, న్యాయవాది నరసింహులు, శివలింగమూర్తి, గడ్డం ముత్యాలప్ప, కోళ్ల రమేష్, ఓబుళరాజు, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

పంట నష్టపరిహారం కోసం పోరాటం

- తుపాను బాధితులకు పరిహారం ఇవ్వాలి
- 19న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట సిపిఎం ధర్నా
- జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాండూస్ తుపాన్ వల్ల జిల్లాలో సాగు చేసిన వరి, కంది, పప్పుశనగ, జొన్న, పత్తి పంటలతో పాటు, ఉద్యానవన పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాండూస్ తుపాను ప్రభావం అనంతపురం జిల్లాలోని 15 మండలాల్లో చాలా ఎక్కువగా ఉందన్నారు. కాగ 8 మండలాల్లో 483 హెక్టార్లలో రూ.3.70 కోట్ల విలువైన వరి, వేరుశనగ, పత్తి, జొన్న, పప్పుశనగ, చెరకు పంటలు మాత్రమే నష్టపోయినట్లు జిల్లా వ్యవసాయ అధికారులు, 25 ఎకరాల్లో ఉద్యాన పంటలు మాత్రమే నష్టపోయినట్లు ఉద్యానవన శాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేయడం సరికాదన్నారు. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే దానిని గుర్తించకుండా నామమాత్రపు నివేదికలు ఇవ్వడం రైతులకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. వాస్తవ అంచనాలను అధికారులు ఎందుకు వేయడం లేదన్నారు. పంటల నష్టంపై ప్రజా ప్రతినిధులు మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. కల్తీ, నాసిరకం విత్తనాల వల్ల పత్తి పంట నష్టపోయిన రైతులకు పరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలని, పంట నష్టపోయిన రైతుల వివరాలు గ్రామ సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కౌలు రైతులకు రైతు అనుమతితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పరిహారం నిజమైన సాగుదారులకు చెల్లించాలన్నారు. గత ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు ప్రకటించిన బీమాలోని రూ.60 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై ఈ నెల 19వ తేదీన జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వి.రాంభూపాల్

రైల్వేకు తలమానికం గుత్తి లోకోషెడ్

రైల్వే సీనియర్ డిఎంఇ యు.రమేష్

ప్రజాశక్తి-గుత్తి

రైల్వే శాఖకు తలమానికంగా గుత్తి లోకోడీజిల్ షెడ్ నిలిచిందని సీనియర్ డిఎంఇ యు.రమేష్ పేర్కొన్నారు. గుత్తి ఆర్ఎస్‌లో ఉన్న రైల్వే డీజిల్ లోకోషెడ్ 59వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా ఘనంగా నిర్వహించారు. డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈ రమేష్ భారీ కేక్‌కట్ చేసి ప్రాంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎంఈ రమేష్ మాట్లాడుతూ 1963లో కేవలం రెండు స్టీమ్ ఇంజన్లతో ప్రారంభం అయిన గుత్తి డీజిల్ లోకోషెడ్ దినదిన ప్రవర్తమానం చెంది నేడు 264 ఇంజన్లను నిర్వహించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. 200 కంప్యూటర్ ఇంజన్లు, 60 ఎలక్ట్రికల్ ఇంజన్లు, 4 ఆల్కోస్ ఇంజన్లు ఉన్నాయన్నారు. దేశ రైల్వేలలో ఎలాంటి టెక్నాలజీ కలిగిన ఇంజన్ లు వచ్చినా వాటి నిర్వహణ కోసం గుత్తిషెడ్‌కు వస్తాయన్నారు. డీజిల్ షెడ్‌లోని కార్మికులు ఎలాంటి శిక్షణ లేక పోయినా అకుంఠిత దీక్ష, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఇంజన్ల నిర్వహణ చేస్తున్నారన్నారు. గుత్తిషెడ్‌లో మరమ్మతులు చేసిన ఇంజన్లు నేడు దేశ వ్యాప్తంగా రైల్వేకు సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రతి ఏటా రైల్వే బోర్డు అవార్డులలో గుత్తి లోకోషెడ్ మొదటి లేదా రెండవ స్థానంలో నిలుస్తోందని అన్నారు. అనంతరం గుత్తి రైల్వే కార్మిక సంఘం నాయకులు తిరుమల రెడ్డి, నారాయణ, రామాంజనేయులు రెడ్డి లు మాట్లాడుతూ గుత్తి షెడ్‌ను కార్మికులు తన కన్నతల్లి కంటే ఎక్కువగా భావిస్తూ విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ రైలు ఇంజన్లు ఎలాంటి ఫెయిల్యూర్స్ లేకుండా సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. తమపై నమ్మకంతో భవిష్యత్తులో బుల్లెట్ ట్రైన్ నిర్వహణ ఇచ్చినా ఎలాంటి ఫెయిల్యూర్స్ లేకుండా మరమ్మతులు చేస్తామని అన్నారు. అనంతరం డీజిల్ షెడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన షెడ్ కార్మికులకు రివార్డులు అందజేశారు. ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని సిబ్బంది సీనియర్ డీఎంఈకి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు కార్యక్రమానికి వచ్చిన సీనియర్ డీఎంఈ రమేష్, డీఎంఈ ప్రమోద్ లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికులు, విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లోకో ఫోర్‌మెన్ లు ప్రభుదాస్, మంజునాథ్, విజయానంద్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్న డిఎంఇ రమేష్

నగరంలో పచ్చదనం పెంచుదాం

మేయర్ మొహమ్మద్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 20వ తేది మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు నగర మేయర్ మొహమ్మద్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మిలతో కలిసి మేయర్ కార్పొరేటర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని కోవూరు నగర్, లెక్చరర్స్ కాలనీలోని పార్కులలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు నగరంలోని 50 డివిజన్ల పరిధిలోనూ చెట్లు నాటించే విధంగా కార్పొరేటర్లు సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం ద్వారా అనంతపురం నగరాన్ని గ్రీన్ అనంతగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగ మోహన్, కార్పొరేటర్లు శ్రీనివాసులు, ఇషాక్, చంద్రమోహన్‌రెడ్డి, కమల్ భూషణ్, బాలాంజినేయులు, సుమతి, బాబా ఫకృద్దీన్ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

నారా లోకేష్‌తో గోవర్ధనరాజు, ప్రసాద్

నారా లోకేష్‌ను కలిసిన పుట్లూరు టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గోవర్ధనరాజు హైదరాబాదులో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు ఓబులాపురం గ్రామానికి చెందిన ప్రసాద్ కూడా నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించినట్లు గోవర్ధన్‌రాజు తెలిపారు.

బి.యాలేరులో ఎంపిపి పర్యటన

ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలోని బ్రాహ్మణ యాలేరు గ్రామంలో ఎంపీపీ సుబ్బర హేమలత శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని సచివాలయం, నాడు-నేడు పనులు, జగనన్న లేఅవుట్, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొండన్న, మండల ఇంజినీర్ పార్థసారథి, సర్పంచి రేణుక, పంచాయతీ కార్యదర్శి లావణ్య, వైసీపీ నాయకులు గంగాధర్, ఎర్రిస్వామి, బండి నాగరాజు, మహేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్

బొమ్మనహాల్ : బొమ్మనహాల్ మండల కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బొమ్మనహాల్ మండల కేంద్రంలోని కనేకల్-బళ్లారి ప్రధాన రహదారిపై ప్రతి శుక్రవారం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తారు. ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారిపై ఒక పోలీసును నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని, మార్కెట్‌ను మరో చోటుకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అంజన్న రథోత్సవం

గుమ్మగట్ట : కెపి.దొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవాన్ని సర్పంచి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి నంది కోలాటాల మధ్య గ్రామ శివారులోని పాదకట్ట వరకు రథాన్ని లాగారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రాయదుర్గం డిపోకు నాలుగు కొత్త బస్సులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం ఆర్టీసీ డిపోకు నాలుగు కొత్త బస్సులు మంజూరయ్యాయి. వీటిని అనంతపురం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కాపు భారతి రిబ్బన్ కత్తిరించి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది, మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బొందలదిన్నెలో పంటల పరిశీలన

తాడిపత్రి రూరల్ : మండలంలోని బొందలదిన్నె గ్రామంలో డిపిఎం లక్ష్మా నాయక్ పప్పుశెనగ పంటలను శుక్రవారం పరిశీలించారు. కొనగుంటపల్లి గ్రామంలో సర్పంచి వెంకట్రామిరెడ్డి, బొందలదిన్నె గ్రామంలో రైతులు ప్రహ్లాదరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంమోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి పొలాల్లో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పప్పుశెనగ, ఆవాలు, జీలకర్ర, అనుములు, అలసంద, జొన్న, సజ్జ పంటలను పరిశీలించారు. వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ ప్రవీణ్, నరేంద్ర కూమార్, జిల్లా కోర్డినేటర్ భానుమతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

టేబుల్ టెన్నిస్ పోటీలలో హెచ్‌పిఎస్ విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురం గుత్తి రోడ్డులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని శ్రీశాన్వి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 టేబుల్ టెన్నిస్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. శుక్రవారం విద్యార్థిని శ్రీశాన్విని పాఠశాల జిఎం రామసుబ్బారెడ్డి, సిఇఒ ప్రతాప్‌రెడ్డి, ఎజిఎం శంకర్ నారాయణ, ప్రిన్సిపల్ కుసుమరేఖ, అధ్యాపక అధ్యపకేతర బృందం అభినందించారు.

ఇంటి డాక్యుమెంటు పోయినది

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌కు చెందిన పల్లె గోవిందమ్మ W/o పి.మల్లారెడ్డి చెందిన దానవిక్రయ దస్తావేజు రిజిస్టర్ నెంబర్ 2621/2011 ను తీసుకొని ఊరు వెళ్లడానికి బస్టాండ్ కి వెళుతుండగా పోయినది. దొరికిన వారు 9581516569 నెంబర్ కు ఫోన్ చేయగలరు.

మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా నియమించాలి

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని మినీ అంగన్‌వాడీ వర్కర్లని మెయిన్ అంగన్‌వాడీ వర్కర్లుగా మార్పుచేసి నియమించాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి, జిల్లా కోశాధికారి జమున డిమాండ్ చేశారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 2017 నుంచి బకాయిపడ్డ టిఎ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్యాస్, కూరగాయలు, బియ్యం తదితరాలను అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని కోరారు. అంగన్‌వాడీలపై గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసుల వేధింపులు ఆపాలన్నారు. హెల్పర్లకు వర్కర్లుగా పదోన్నతి కల్పించేందుకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు అడగటం సరికాదన్నారు. అర్హులు, సీనియారిటీని బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. అంగన్‌వాడీలకు వేతనం రూ.21 వేలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ పోస్టుల నియామకాలు ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేలా ఉన్నాయన్నారు. దానిని రదుచేసి నూతన నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతులు ఇచ్చి సూపర్‌వైజర్ పోస్టులు భర్తీచేయాలని కోరారు. వయస్సుతో నిమిత్తం లేకుండా సర్వీస్‌ను బట్టి పదోన్నతి కల్పించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న సెల్‌ఫోన్లు మార్చి ఇవ్వాలని, ఆ తరువాతనే యాప్ తదితర విధులు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు విజయ, ధనలక్ష్మి, గోవిందమ్మ, జయభారతి, కాత్యాయని, రమణమ్మ, విజయ, నిర్మల, అశ్వర్థమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షులు నాగేంద్రకుమార్

బిటిపి ఎడమ కాలువకు నీరు విడుదల

నీటిని విడుదల చేస్తున్న కాపు భారతి

ప్రజాశక్తి-గుమ్మగట్ట

భైరవానితిప్ప ప్రాజెక్ట్ ఎడమ కాలువకు ఇరిగేషన్ డీఈ వెంకటరమణ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి శుక్రవారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ వెంకటరమణ మాట్లాడుతూ ఒకటవ డిస్ట్రిబ్యూటర్ నుండి 14వ డిస్ట్రిబ్యూటర్ వరకు దాదాపుగా 5600 ఎకరాల్లో ఆరుతడి పంటలకు నీరు విడుదల చేశామని చెప్పారు. రైతులు కేవలం ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని సూచించారు. రైతులు సాగునీటిని వృథా కానివ్వకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూటర్ల పరిధిలో అక్కడక్కడా కొంత మరమ్మతులు చేపట్టడంతో నీరు వదలడం కొద్దిగా జాప్యం జరిగిందన్నారు. బిటిపి రిజర్వాయర్ పరిధిలో లస్కర్లు ఇతర సిబ్బంది కొరత వల్ల కొన్ని సమస్యలు తలెత్తాయన్నారు. సాగునీటిని రైతులకు సక్రమంగా అందించటానికి తాత్కాలిక ప్రయివేటు సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రైతులు అధికారులకు సహకరించి నీటిని వాడుకుని పంటలు పండించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మహేష్, కాంతారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ మంజునాథ, ప్రతాపరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ సెక్రెటరీ గోవిందు, రాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ తాగునీరు సరఫరా

సమావేశంలో మాట్లాడుతున్న ఆఫీసర్ శివశంకర్

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని ప్రతి కుటుంబానికి మంచినీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివశంకర్ తెలిపారు. శుక్రవారం పంపనూరు గ్రామ సచివాలయంలో సర్పంచి ఎర్రిస్వామి ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో బావులు, కుంటలు వద్దకు వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం ప్రతి చెరువులో నీరు ఉండడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. బోర్లలో నీరు పుష్కలంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో రూ.కోట్లు వెచ్చించి ప్రతి ఇంట్లోని ఒక వ్యక్తికి 55 లీటర్ల చొప్పున నీటిని ఇచ్చేందుకు గ్రామాల్లో పైపులైన్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 2024 లోపు ప్రతి ఇంటికీ ఉచితంగా కొళాయి అమరుస్తామన్నారు. నీటిని వృథా చేయకుండా వాడుకుంటే భవిష్యత్తు తరాలకు మేలుచేసిన వారమవుతామన్నారు. అనంతరం రైజెస్ ఎన్జీవో ఐఈసీ ఎక్స్‌పర్ట్ శ్రీనివాసులు, సోషల్ మొబలైజర్ ఓబులపతి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని నీటి నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి అశోక్ నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్, డిజిటల్ అసిస్టెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -అనంతపురం కలెక్టరేట్

సాంస్కృతిక, సాహిత్య విభాగాలలో రెండవ దశ పోటీలలో భాగంగా అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలలో ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ విద్యార్థుల వ్యవహారాల డీన్ డాక్టర్ పి.సాంబశివరావు హాజరయ్యారు. విశ్వవిద్యాలయ పరిధిలోని 16 కళాశాలల విద్యార్థులకు స్వాగతానంతరం అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. విశ్వవిద్యాలయ వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినందుకు బాలాజీ విద్యాసంస్థల యాజమాన్యాన్ని, ఆతిథ్య కళాశాల అసోసియేట్ డీన్, బోధన, బోధనేతర బృందాన్ని అభినందించారు. శ్రీ బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణకిషోర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక స్పృహ పెంపొందించుకోవాలని సూచించారు. విశ్రాంత డిజిపి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చు కోవాలన్నారు. ఓటమిని విజయానికి సోపానంగా మలచుకోవాలని సంబోధించారు. మొదటి రౌండ్‌లో భాగంగా చెస్, క్యారమ్స్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.నారాయణ రెడ్డి, ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ ఆఫ్ పివికెకె డాక్టర్ సంతోష్‌రెడ్డి, పరిపాలన అధికారి ముత్యాలప్ప పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

తాగునీటికి రూ.65.94 కోట్లు మంజూరు

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు, బెలుగుప్ప, విడపనకల్లు మండలాల్లోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.65.94 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్సీ వై.శివరాంరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఐదు మండలాల్లోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సిఎం జగన్మోహన్ రెడ్డి నిధులు విడుదల చేశారన్నారు. తాగునీటి సమస్యపై తాను స్వయంగా సీఎం జగన్, ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి దాదాపు రూ.7668.25 కోట్లు పనులు చేపడుతున్నారన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు నెంబర్ 918 తేదీ 21.11.2022 నాడు విడుదల చేశారన్నారు. ఆ నిధులతో ఉరవకొండ నియోజకవర్గంలో తాను కోరిన ప్రతి తాగునీటి పథకానికి ఆమోదం లభించిందని చెప్పారు. అందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గంలో రూ. 65.94 కోట్లతో దాదాపు 135 పనులకు ఆమోదముద్ర లభించిందని వివరించారు. అన్ని మండలాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ నిధుల్లో జెజెఎం పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు పనులు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ అంజిమాన్ సఫ్రీన్, వజ్రకరూరు ఏఈ.లు ఎమ్మెల్సీ శివరాంరెడ్డిని కలిసి నిధుల మంజూరు కాబడిన పనులపై చర్చించారు.

30వ డివిజన్‌లో జనసేన శ్రమదానం

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఆపార్టీ జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ తన సొంత నిధులను వెచ్చించి శ్రమదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మూడవరోజు శుక్రవారం నగరంలోని 27, 30 డివిజన్లో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భాష్యం పాఠశాల వద్ద రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో కంకరపొడి, సిమెంట్ మిశ్రమాన్ని వేసి గుంతలు పూడ్చారు. రహదారి మొత్తం గుంతలుగా ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఈ రోడ్డుపై ప్రయాణం దుర్భరంగా మారిందని స్థానికులు వాపోయారు. ఒక్క ఫోన్‌కాల్ చేయగానే జనసేన నాయకులు టిసి వరుణ్, జన సైనికులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయడం పట్ల స్థానికులు జనసేన పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, దరాజ్ బాషా, నగర కార్యదర్శిలు మురళి, రాజేష్ కన్న, లాల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేస్తున్న జనసైనికులు

వీధిదీపాలను అందుబాటులోకి తీసుకురండి

నగర మేయర్ మొహమ్మద్ వసీం

సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో జరుగుతున్న ఫోర్‌లైన్ రోడ్డుపై ఏర్పాటు చేస్తున్న వీధి దీపాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని నగర మేయర్ మహమ్మద్ వసీం కాంట్రాక్టర్లకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్ సమీపంలోని విజయనగర్ ప్రాంతంలో మేయర్ వసీం శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఫోర్ లైన్ రహదారి పక్కన స్ట్రీట్ లైట్లు లేక రాత్రిపూట ఇబ్బంది పడుతున్నామని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన రహదారి పనులు చేపడుతున్న కంపెనీ ప్రతినిధులకు ఫోన్ ద్వారా సమస్యను తీసుకువెళ్లి త్వరితగతిన లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్పందించిన వారు మరో పది రోజుల్లో పనులు పూర్తిచేసి లైట్లను అందుబాటులో ఉంచుతామని మేయర్‌కు వివరించారు. మేయర్ వెంట కార్పొరేటర్ కమల్ భూషణ్, ఎస్ఈ నాగమోహన్, డీఈ చంద్రశేఖర్ ఉన్నారు.

జిబిసికి మరమ్మతులు త్వరగా చేపట్టండి

ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

జిబిసి కెనాల్‌కు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు సూచించారు. విడపనకల్ మండలం కరకముక్కల వద్ద ఉన్న గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు గండి పడిన ప్రదేశాన్ని జిబిసి అధికారుల సమక్షంలో వారు గురువారం పరిశీలించారు. అక్కడ చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపిపిమాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ పుష్పావతి తన సొంత నిధులు వెచ్చించి రైతుల సంక్షేమం కోసం ఈ మరమ్మతు పనులు చేపట్టామన్నారు. జిబిసి కెనాల్‌కు గండిపడిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు గండిపడడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. జిబిసి కెనాల్ పరిధిలో విడపనకల్లు మండలంలోని ఉండబండ, పాల్తూరు, కరకముక్కల, హావలిగి, వేల్పుమడుగు, డోనేకల్, గడేకల్ తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారన్నారు. పంటలు చేతికివచ్చే సమయంలో అధికారుల నిర్లక్ష్యంతో సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీమరెడ్డి, భరత్‌రెడ్డి, మండల కన్వీనర్ బసన్న, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, జిబిసి డీఈ రామాంజనేయులు, జేఈలు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, ఎంపిటిసిలు రాజశేఖర్, తిమ్మరాజు, భీమ్‌రావు, సర్పంచులు ఉమాశంకర్, రఘురాములు, దేవరాజు, కేసన్న, వైసిపి నాయకులు దేశాయ్ సిద్ధార్థ, జనార్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, రామాంజనేయులు, అశోక్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డ్రిప్ పరికరాలు చోరీ

ప్రజాశక్తి-బెలుగుప్ప

రూ.2 లక్షలు విలువజేసే డ్రిప్ పరికరాలు చోరీకి గురైన సంఘటన బెలుగుప్ప మండలం ఇరుపాపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన హరిజన మారెప్ప కుమారుడు హరిజన వెంకటేశులు బోరుబావు కింద 4. 60 ఎకరాల్లో డిప్పుతో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పొలంలో వేరు శనగ సాగు చేసేందుకు దుక్కు దున్ని చదును చేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వేరుశనగ సాగు చేసేందుకు తోటకు వెళ్లాడు. నాగార్జున కంపెనీకి చెందిన 40 కట్టల డ్రిప్పు పరికరాలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. వాటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. దీనిపై బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ పట్టణంలో కుటుంబ కలహాలతో మద్యం మత్తులో సురేష్ అనే యువకుడు బీరు బాటిల్‌తో గొంతు కోసుకుని శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. లత్తవరం రోడ్డులో సమ్మనకుంట వద్ద తీవ్ర గాయంతో పడివున్న అతన్ని కొందరు యువకులు ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. తాగుడుకి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడి మద్యం దుకాణం సమీపంలోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు

చికిత్సపొందుతున్న సురేష్

ఎంఇఒ కార్యాలయానికి చేరిన ట్యాబ్‌లు

ప్రజాశక్తి-నార్పల

ఎనిమిదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం పంపిణీ చేయనున్న ట్యాబ్‌లు నార్పల మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయానికి శుక్రవారం చేరాయి. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఎనిమిదవ తరగతి చదివే విద్యార్థులు 700 మందికి పైగా ఉన్నారు. ప్రస్తుతం మొదటి విడతలో భాగంగా 180 ట్యాబ్‌లు వచ్చాయని, త్వరలోనే మిగిలిన ట్యాబ్‌లు కూడా వస్తాయని ఎంఇఒ కృష్ణయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎనిమిదో తరగతి చదివే ప్రతి విద్యార్థికీ ట్యాబ్ పంపిణీ చేస్తోందన్నారు. పదోతరగతి పూర్తి అయ్యేవరకు ట్యాబ్‌లు విద్యార్థుల వద్దే ఉంటాయని ఆయన వెల్లడించారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-గుంతకల్లు

అనంతపురం, ధర్మవరం, గుంతకల్లు రైల్వేస్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేసి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్ వెంకటరమణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సిపిఐ నాయకులు డిఆర్ఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల కాలంగా అనంతపురం, ధర్మవరం స్టేషన్లలో ప్రయాణించే ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫారం నుండి మరో ప్లాట్ఫారంలోకి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రయాణికుల సమస్యను గుర్తించి లిఫ్టులు, ఎక్సలేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. గుంతకల్లు రైల్వే స్టేషన్ లో ఒక్కొక్క ప్లాట్‌ఫాం లో ఒక్కొక్కటే లిఫ్ట్ ఉందన్నారు. ప్రతి ప్లాట్‌ఫారంలో ఎస్కలేటర్ అవసరం ఉందన్నారు. గుంతకల్లు స్టేషన్‌లో రాత్రి వేళలో ఎస్కలేటర్లు, లిఫ్టులు పనిచేయడం లేదన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని ప్లాట్‌ఫారంలందు లిఫ్టులు, ఎస్కలేటర్లు 24 గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఎంను కోరారు. గుంతకల్లు స్టేషన్ నుండి వచ్చిపోయే రైళ్లను కొన్ని రద్దు చేశారని వాటిని పునరుద్ధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, నాయకులు మల్లయ్య, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

27న 'ఎస్సీ కార్పొరేషన్' ముట్టడి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎస్సీ జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ దాసగానిపల్లి కుల్లాయప్ప ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టిన ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం ఉరవకొండ నియోజకవర్గం అధ్యక్షులు గుడిసెల రాజేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉరవకొండ ఆర్అండ్‌బి బంగ్లా ప్రాంగణంలో ముట్టడికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు అయినా ఎస్సీల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించడం సరికాదన్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఎస్సీ వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 27న చేపట్టిన ఎస్సీ కార్పొరేషన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జన సంఘం స్టూడెంట్ ఫెడరేషన్ నియోజకవర్గ అధ్యక్షులు స్వర్ణసాగర్, సభ్యులు లక్ష్మన్న, సుధాకర్, శ్యాంకుమార్, హరీష్, ఎర్రిస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

గుత్తి : గుత్తి మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషా హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబరు 699-2బి, విస్తీర్ణం 2 ఎసి ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన లేఅవుట్లను తహశీల్దారు, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అక్రమంగా వేసిన లే అవుట్లను, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్లోని లేఅవుట్లను చట్ట ప్రకారం తొలగించడంతో పాటు ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటమన్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో వేసిన లేఅవుట్లను కొనుగోలు చేసి నష్టపోవద్దని తహశీల్దార్ సూచించారు.

పారిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

ఆత్మకూరు : ఇంటి నుంచి పారిపోయిన వ్యక్తి ఆచూకీని ఆత్మకూరు పోలీసులు కనుగొన్నారు. 2019 అక్టోబరులో ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన మాల రామాంజనేయులు ఇంట్లో సమస్యలతో శ్రీశైలం వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన తిరిగి ఇంటికి రాలేదు. తన భర్త కనిపించడంలేదని భార్య మాల అంజనమ్మ 2020 జనవరి లో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి రామాంజనేయులు కోసం చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో వెతికారు. మదనపల్లి దగ్గర బేల్దారు పనిచేస్తున్నాడని తెలుసుకొని రామాంజనేయులును తీసుకువచ్చి శుక్రవారం భార్య అంజనమ్మకు అప్పగించారు. ఇటుకలపల్లి సీఐ మోహన్, ఆత్మకూరు ఎస్ఐ

రామాంజనేయులును చూపుతున్న పోలీసులు